క్లుప్తంగా

26న వాహనాల వేలం

సీతంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 26న వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో, పల్సర్ బైక్‌లకు వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొవాలన్నారు.

నేడు గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: వివిధ కేసుల్లో పట్టుబడ్డ ఐదు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం వేలం వేయనున్నట్టు స్థానిక ఎస్‌ఐ అమ్మన్నరావు బుధవారం తెలిపారు. పాలకొండ డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 9 గంటలకు వాహనాల వేలం పాటను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆశక్తి గల వారు ఆధార్ కార్డుతో హాజరై వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

నిత్యావసర వస్తువుల వితరణ



గిరిజనులకు ప్రోత్సహకాలను అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కురుపాం: ఎస్.సొసైటీ ఆధ్వర్యంలో గూంజ్ సంస్థ సహకారంతో మండలంలోని నేరేడువలస, తెన్నుఖర్జ, చెరువు కొమ్మవలస గ్రామాలకు చెందిన 160 మంది కుటుంబాలకు దుస్తులు, బెడ్‌షీట్స్, చెప్పులు, నిత్యావసర వస్తువులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి తిరుపతి, కార్యదర్శి షేక్ గౌస్, ఎండబ్ల్యూఎస్ సంస్థ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఆరోపణలు రానివ్వొద్దు..


సమావేశంలో మాట్లాడుతున్న తోట సింహచలం

భామిని: గ్రామీణ ప్రజల ఉపాధి కల్పనకు చేపట్టిన ఉపాది హామీ పథకం అమలులో ఆరోపణలు రావడం సరికాదని మండల ప్రత్యేక ఆహ్వానితులు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహచలం అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి చేపడుతున్న పనుల వివరాలు తీసుకువెళ్తే బాగుంటుందన్నారు. ఇప్పటి వరకు సమస్యలు రాలేదని, ఇక రానివ్వద్దన్నారు. ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఏపీఓ ఇ.తులసీదాస్, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



గొడుగుల తయారీపై శిక్షణ ఇస్తున్న సొసైటీ ట్రైనీలు

భామిని: మండలంలోని బత్తిలి కనోషియన్ డాటర్స్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక స్వావలంభన దిశగా చేతివృత్తులపై బుధవారం శిక్షణ ఇచ్చారు. సొసైటీ నిర్వాహకురాలు సిని మాథ్యూ ఆధ్వర్యంలో మహిళలకు గొడుగుల తయారీపై శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనీలు విస్సి తరంచేన్, దివ్య రాడల ఆధ్వర్యంలో గొడుగుల తయారీకి అవసరమైన సామగ్రి సేకరణ, చేతివృత్తి ద్వారా నాణ్యత గల గొడుగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. సొసైటీ క్లస్టర్ కోఆర్డినేటర్లు టింగ జ్యోతి, జయంతి పర్యవేక్షణలో ఉచిత శిక్షన జరిగింది. అనంతరం మహిళా సభ్యులు తయారు చేసిన గొడుగులు ప్రదర్శించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాలకొండ మండలం ఎరకరాయపురం గ్రామానికి చెందిన బెవర సాయి కుటుంబానికి బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కళావతి అందజేశారు.

పాత దుగ్గిలో గజరాజులు


నాగావళి ముంపు ప్రాంతంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలానికి గజరాజులు బాధలు వీడడం లేదు. నెల రోజులుగా ఏడు ఏనుగుల గుంపు దుగ్గి, కల్లికోట, గుణానపురం గ్రామ పరిసరాల్లో సంచారం చేస్తున్నాయి. బుధవారం పాత దుగ్గి సమీపంలో నాగావళి ముంపు ప్రాంతంలో సంచారం చేస్తున్నాయని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. గ్రామస్తులు రాత్రిపూట పొలాల్లోకి వెళ్లొద్దని అటవీ సిబ్బంది సూచించారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

• ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేస్తూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారథుల్లా ఉన్న వలంటీర్లను చూస్తే తెలుగుదేశం, జనసేన పార్టీలతో పాటు ఈనాడు అధినేత రామోజీరావుకు వెన్నులో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొని మాట్లాడారు. కొన్ని రోజుల క్రితం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేసి కించపరిచారన్నారు. అలాగే ఇంకొన్ని రోజుల క్రితం ఈనాడు అధినేత రామోజీరావు 'నేటి నుంచి వలంటీర్ల సమ్మె...జగన్‌పై సొంత సైన్యం యుద్ధం' అంటూ ఈనాడులో తప్పుడు కథనం అచ్చువేశారని దుయ్యబట్టారు. మొన్నటికి మొన్న 'నేడు ఊరూరా వలంటీర్లు...అన్ని చోట్ల జగన్ అరాచకాలు' అంటూ మరో తప్పుడు కథనంతో వలంటీర్లను విద్రోహులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేస్తూ... నిత్యం వలంటీర్లపై రామోజీ బురదజల్లే రాతలు రాస్తున్నారని అన్నారు. ఇంతలా ప్రతీసారీ వలంటీర్లను టార్గెట్ చేస్తున్నారంటే మిమ్మల్ని చూసి ప్రతిపక్షాలు, పచ్చ మీడియా భయపడుతోందని ఎమ్మెల్యే అన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రాణ భయంతో ఎక్కడో దూరంగా ఈ ప్రతిపక్షాలు దాక్కున్నాయని, వలంటీర్లు మాత్రం తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రజల మధ్య తిరుగుతూ వారికి సేవలు చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తూ ఆపద్బాంధువులుగా నిలిచారని ఎమ్మెల్యే కళావతి అన్నారు. ఇంతటి సేవలను అందించిన వలంటీర్లను సత్కరించుకోవడం మన బాధ్యతన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటర్లు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: చాపరాయి బిన్నిడిలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో సచివాలయం ఉద్యోగులు, కన్వీనరు


కొమరాడ: గుణానపురంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు


పాలకొండ రూరల్: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి


జియ్యమ్మవలస: పెదమేరంగి సచివాలయంలో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ అనురాధ


వీరఘట్టం: సేవారత్న అవార్డులు పొందిన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, నాయకులు, అధికారులు


గరుగుబిల్లి: వలంటీర్లను సత్కరించిన జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు

వలంటీర్లకు సన్మానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చాపరాయి బిన్నిడి గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న వలంటీర్లకు బుధవారం సచివాలయం వైఎస్సార్ సీపీ కన్వీనర్లు తాడంగి పాపారావు, ఎం.అశోక్, ఎం.రామకృష్ణ, ఎం.భీమారావు సచివాలయం ఉద్యోగులతో కలిసి సన్మానిస్తూ సేవామిత్ర పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్ ఉన్నారు.

వలంటీర్లకు వందనం

కొమరాడ: వలంటీర్ల సేవలకు ప్రతి ఒక్కరూ వందనం చేయాల్సిందేనని వారి సేవలు అంత అమోఘమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపు రెడ్డి జనార్దనరావు అన్నారు. గుణానపురం గ్రామ సచివాలయంలో గంగారేగువలస, కంబవలస, కల్లికోట, గుణానపురం గ్రామల్లో ఉన్న వలంటీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ

గరుగుబిల్లి: గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశంలో మిగిలిన రాష్ట్రాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తుందని జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండలంలోని రావివలస గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో తోటపల్లి ఆలయ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్

జియ్యమ్మవలస: వలంటీర్లు అంకితభావంతో ప్రజలకు అందిస్తున్న సేవలు భేష్ అని సర్పంచ్ అనురాధ అన్నారు. పెదమేరంగి సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ శశికళ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు వాన నారాయణరావు, మరడాన కిశోర్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు శ్లాఘనీయం

పాలకొండ రూరల్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సేవలు నేరుగా ప్రజల చెంతకు చేర్చే క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ చేస్తున్న సేవలు శ్లాఘనీయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ నగర పంచాయతీ పరిధిలో చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వలంటీర్లకు వందన కార్యక్రమాన్ని ఆమె పాల్గొన్నారు. సేవా వజ్ర, రత్న, సేవా మిత్ర పేరిట అత్యుత్తమ సేవలు అందించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాపరావు, పాలకవర్గ సభ్యులు, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మోసపూరిత హామీలను నమ్మొద్దు

• ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు టీడీపీ, జనసేన పార్టీలు మోసపూరిత హామీలతో ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని వారి బారి నుంచి ఈ రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే కళావతి పిలుపునిచ్చారు. వీరఘట్టంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో బుధవారం సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ప్రతీ ఇంటికి నవరత్న పథకాల్లో ఏదో ఒక పథకం వర్తించిందని, ప్రభుత్వ పథకాలు పొందని ఇళ్లు ఒక్కటి కూడా లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మనకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే అన్నారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న ప్రతీ గడపకు వెళ్లి టీడీపీ ఇస్తున్న దొంగ హామీలపై అవగాహన కల్పించాలని సూచించారు. 2014లో ఆరు వందలకు పైగా హామీలు ఇచ్చి గెలిచిన తరువాత మేనిఫెస్టో నుంచి ఈ హామీలను తొలగించి ఓటేసిన ప్రజలను చంద్రబాబునాయుడు నిలువునా ముంచిన విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. జన్మభూమి కమిటీల అరాచకాలు, మోసాలను గుర్తు చేయాలన్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేసుకుని దొంగ ఓట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, భోగి మణి, మాచర్ల వెంకటరమణ, డోకల శ్రీను పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవిద్దాం


గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవ కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం: మన మాతృభాష తెలుగును ప్రతీ ఒక్కరూ గౌరవించాలని, సంభాషించాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం కార్యక్రమాన్ని కళాశాల వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ జీవనోపాధి అవకాశాల కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదన్నారు. మాతృభాషలోని సౌందర్యం ఇతర భాషలలో లేదన్నారు. తెలుగు అధ్యాపకులు డి.రామయ్య మాట్లాడుతూ మాతృభాష తెలుగు కావడం గర్వకారణమని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాధ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

వీరఘట్టం: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో తెలుగు భాష ఔన్నత్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తలవరం హైస్కూల్‌లో హెచ్.ఎం ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు చేశారు.

గరుగుబిల్లికి జూనియర్ కళాశాల మంజూరు

గరుగుబిల్లి : మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర విద్యా శాఖ ఉత్తర్వులను మంగళవారం జారీ చేసింది. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ 2024–25 విద్యా సంవత్సరం నుంచి కో–ఎడ్యుకేషన్ విధానంలో కళాశాలను నిర్వహిస్తున్నట్టు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో చెరో 40 మంది విద్యార్థులతో తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు. మండలంలో కేజీబీవీ, గురుకుల కళాశాలలతో పాటు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు అందుబాటులో కళాశాల విద్య అందే అవకాశం వుంది. మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు పట్ల కృషి చేసిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం


గంగారేగువలసలో పిల్లల సామర్థ్యం పరీక్షిస్తున్న పీడీ రాణి

కొమరాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా ఎఫ్‌ఆర్‌సీ ద్వారా పౌష్టికాహారం అందజేయాలని ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి అన్నారు. గంగారేగువలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు కచ్చితంగా రక్తహీనత లోపం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంపై తల్లులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆమె వెంట నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, సీడీపీఓ సుగుణకుమారి, సూపర్‌వైజర్లు ఉన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

• డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు


కొమరాడ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.జగన్నాథరావు

కొమరాడ: పీహెచ్‌సీల్లో రాత్రి పూట వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని కొమరాడ, కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలను ఆయన మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది రాత్రి పూట కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పలు రికార్డులు పరిశీలించారు. గిరిశిఖర గ్రామాల్లో గిరిజనులకు అన్ని వేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సేవాభావంతో ఉండాలన్నారు. మెరుగైన చికిత్స అవసరమైతే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించాలని సూచించారు. గర్భిణులకు ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 24 గంటలూ సేవలు అందించి పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

మారుమోగిన రామనామ స్మరణ


ఆలయ ప్రతిష్ఠలో భాగంగా చేసిన యాగాల్లో పాల్గొన్న ప్రజలు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌కే రాజపురం గ్రామంలో బుధవారం శ్రీరామ మందిర ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా గ్రామంలో ఆలయ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. బుధవారం ఆలయ ఆవరణలో యజ్ఞకర్తల ఆధ్వర్యంలో యాగం చేశారు. గ్రామస్తులంతా యాగంలో పాల్గొని శ్రీరామనామ స్మరణ చేశారు. ధ్వజ స్తంభం, విగ్రహాల ప్రతిష్ఠ, పుణ్యవలోచనం వంటి కార్యక్రమాలను సందడిగా నిర్వహించారు.

ఆర్‌ఐటీఐలో వర్చ్యువల్ తరగతులు


వర్చ్యువల్ తరగతులను వీక్షిస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు బుధవారం వర్చ్యువల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ వర్చ్యువల్ తరగతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10లక్షలతో తమ కళాశాల వద్ద పెద్ద టీవీ, కెమెరా, ఏంపిల్‌ఫ్లైయర్, మైకులు, స్పీకర్స్, బెంచీలు, టెబుల్స్, ఏసీ తదితరవి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతీ రోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో వర్చ్యువల్ తరగతులు జరుగుతాయని, ఈ వర్చ్యువల్ తరగతులు రాష్ట్ర వ్యాప్తంగా గల 33 ఐటీఐలలో ఎక్కడి నుంచి బోధించిన ఇక్కడి నుంచి వీక్షించవచ్చని తెలిపారు. అలాగే ఇక్కడ బోధించినా మిగతా ఐటీఐలకు చెందిన విద్యార్థులకు నేరుగా వీక్షించవచ్చనని తెలిపారు. ఈ అవకాశాన్ని ఐటీఐకు చెందిన అన్ని ట్రేడుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

సీతంపేటకు జూనియర్ కళాశాల మంజూరు


అప్‌గ్రేడ్ కానున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల


సీతంపేట: సీతంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నెరవేరని హామీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెరవేరడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 210 హైస్కూల్స్‌ను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 14ను మంగళవారం విడుదల చేసింది. దానిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చోటుదక్కడంతో విద్యార్థుల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. దశాబ్దాల కాలంగా జూనియర్ కళాశాల ఇక్కడ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కొత్తూరు, పాతపట్నం, పాలకొండ, హిరమండలం, శ్రీకాకుళం, రాజాంలో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించడంతో బోలెడంత ఖర్చుతో కూడుకున్న పనిగా మిగిలింది.. ఏటా మండలంలో దాదాపు 800ల మంది వరకు టెన్త్ నుంచి రిలీవ్ అవుతారు. కేవలం గిరిజన విద్యార్థులకు మాత్రమే మల్లిలో సీవోఈ కళాశాల, సీతంపేటలో బాలుర, బాలికల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో కేవలం పరిమిత సీట్లు అంటే గ్రూపుకు 40 చొప్పున మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా గిరిజన విద్యార్థులను చేర్చుకుంటారు. అన్ని కళాశాలలు కలిపి 360 మంది విద్యార్థులను మాత్రమే జాయిన్ చేసుకుంటారు. అంతకు మించి ఎవర్నీ చేర్చుకోరు. రిజర్వేషన్ ప్రకారం ఓసీ, బీసీ, ఎస్సీ, ఏఈక్యూ విద్యార్థులకు గ్రూపుకు ఒక్కటి మాత్రమే కేటాయిస్తారు. మిగతా సీట్లన్ని గిరిజన విద్యార్థులకే కేటాయిస్తారు. దీంతో జనరల్ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ సీటు లభించని పరిస్థితి. ఇప్పుడు 2024 – 25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఏర్పాటు చేయనుండడంతో ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే చదువుకోనున్నారు. ప్రస్తుతం స్థానిక హైస్కూల్లో 245 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 59 మంది టెన్త్ చదువుతున్నారు. వీరు ఉత్తీర్ణత సాధిస్తే ఇక్కడే ఉండి చదువుకునే అవకాశం ఉంది.

ఆనందంగా ఉంది..


జూనియర్ కళాశాల అప్‌గ్రేడ్‌తో పాటు మంచి ఫ్యాకల్టీనీ కూడా ఏర్పాటు చేయాలి. అలాగే తరగతి గదుల కోసం అదనపు భవనాలు నిర్మిస్తారని ఆశిస్తున్నాం. స్థానికంగా జూనియర్ కళాశాల ఏర్పాటు ఎంతో ఆనందంగా ఉంది.

– జి.తన్వీర్, పదో తరగతి

జీఓ వచ్చింది


మా పాఠశాల అప్‌గ్రేడ్‌కు సంబంధించి జీఓ ప్రభుత్వం నుంచి వచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మా పాఠశాలలో ఇంటర్మీడియెట్ గ్రూపులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు మంచి అవకాశం.

– వై.హేమసుందరరావు, హెచ్‌ఎం, సీతంపేట

వృత్తి విద్యాకోర్సులకు అవకాశం


జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులను కూడా పెట్టనున్నారు. ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఇక్కడ అవకాశం లభించనుంది. జనరల్ గ్రూపులతో పాటు ఇక్కడ వృత్తి విద్యా కోర్సులు కూడా విద్యార్థులు చదువుకోవచ్చు. – పాణిగ్రాహి, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్

ఇంటర్మీడియెట్ ఇక్కడే చదువుకుంటాం..


ఇంటర్మీడియెట్ ఇక్కడే చదువుకునే అవకాశం లభించింది. పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉన్నత చదువులకు ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. నిమ్మక నవ్యశ్రీ, టెన్త్ విద్యార్థిని

నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి:


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ అమ్మన్నరావు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి – గొట్టివలస రహదారి పరిధిలో వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. సక్రమంగా రికార్డులు లేని చోదకులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు వాహన చట్టంలోని నిబంధనలు పాటించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నియమాలను పాటిస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చునన్నారు.

నేడు షేకుపాడు బీటీ రహదారి ప్రారంభం

కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ షేక్‌పాడు గిరిజన గ్రామానికి వెళ్లే బీటీ రహదారిని గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రారంభించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు బుధవారం తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.47 లక్షలతో నిర్మాణం పూర్తయిన 750 మీటర్ల బీటీ రహదారి పూర్తయినట్టు చెప్పారు.